సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



విదేశాల్లో విలవిల

విదేశాలకు వెళ్లే జిల్లావాసులను ఏజెంట్లు మోసం చేస్తున్నారు. నిరుద్యోగుల బలహీనతతో ఆడుకుంటున్నారు.

- 8లో



శుభ కార్యానికి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

- 8లో

9న అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో ఈ నెల 9న ప్రధాన మంత్రి అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అర్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

న్యూస్‌రీల్

తోలాపి ఘటనపై విచారణ



విచారణ జరుపుతున్న ఎంపీడీఓ మన్మధరావు

పొందూరు: మండలంలోని తోలాపి సచివాలయంలో వీఆర్‌వో ఎం.దివాకర్(రేవతిరావు)పై జరిగిన దాడి ఘటనపై ఎంపీడీఓ ఎం.మన్మధరావు గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన పప్పల రామినాయుడు సచివాలయంలో కంప్యూటర్‌ను ధ్వంసం చేయడమే కాకుండా వీఆర్‌వోపై దాడికి పాల్పడిన ఘటనపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎంపీడీవో గురువారం సచివాలయం సిబ్బంది, గ్రామస్తులతో వేరువేరుగా విచారణ చేపట్టారు.

వీఆర్‌ఓల నిరసన



ధర్నా చేస్తున్న వీఆర్వోలు

నరసన్నపేట: పొందూరు మండలం తోలాపి వీఆర్వో ఎం.దివాకర్‌పై దాడి చేసి అవమానించిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని నరసన్నపేట వీఆర్వోలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

కార్గో ఎయిర్‌పోర్టు పేరిట కుట్ర



కరపత్రాల ఆవిష్కరిస్తున్న నాయకులు, రైతులు

పలాస: బహుళజాతి ప్రయోజనాల కోసమే కార్గో ఎయిర్‌పోర్టులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, ఇందులో పేదలకు ప్రయోజనాలేవీ లేవని సి.పి.ఐ.ఎం.ఎల్. న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వి.మాధవరావు అన్నారు. మందస మండలం గంగువాడలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకరాపల్లి సోంపేటకు మధ్య ఈ సరుకు రవాణాకు సంబంధించిన కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, వంకల పాపయ్య, మామిడి భీమారావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

టెక్కలి: మారుతున్న కాలంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుజాత అన్నారు. ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్ అండ్ ఇంటెలిజెంట్ మేనిఫేక్చరింగ్ సిస్టమ్స్ అంశంపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మానవ మేధస్సు వృద్ధి చెందే విషయంలో మానవత్వం లోపిస్తే సమాజానికి నష్టమని అభిప్రాయం వ్యక్తం చేశారు. సదస్సు కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ 156 రకాల వివిధ ఆలోచనలతో కూడిన పత్రాలు వచ్చాయని, ఇందులో 50 పత్రాలను ఎంపిక చేశామని చెప్పారు.

కూటమి ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను ఎండగట్టాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్ సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, విశ్వాసరాయి కళావతి, టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్, ఆమదాలవలస ఇన్‌చార్జి చింతాడ రవి తదితరులు హాజరయ్యారు. – శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఈ నెల 7న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (మెగా పేరెంట్ టీచర్) పండుగ వాతావరణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఈఓ తిరుమల చైతన్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో భాగంగా ప్రతి విద్యార్థికి సమగ్ర ప్రగతి పత్రం(హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డు) అందజేస్తామన్నారు. పాఠశాలలకు విరాళాలు ఇచ్చిన దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా సమావేశంలో భాగస్వాములవుతారని చెప్పారు.

ప్రచారమే తప్ప పరిష్కారమేదీ?



- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు
- భూ వివాదాలపై అక్టోబర్‌లో గ్రామసభల నిర్వహణ
- కార్యక్రమాల హడావిడే తప్ప పరిష్కారం చూపని కూటమి ప్రభుత్వం
- గ్రామసభల్లో ఇప్పటికే 30,669 అర్జీలు స్వీకరణ
- కేవలం 62 అర్జీలకు మాత్రమే పరిష్కారం
- మిగతావన్నీ పెండింగ్‌లో పెట్టేసిన పరిస్థితి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఏదో అమలు చేస్తున్నట్లు హడావుడిగా కార్యక్రమాలు నిర్వహించడం.. ప్రజల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించడం.. వాటిని బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారుతోంది. అసలీ ప్రభుత్వానికి సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి ఉందా? పబ్లిసిటీ కోసమే కార్యక్రమాలు చేపడుతుందా? ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన చేస్తుందా..? ఇవీ కూటమి ప్రభుత్వ పాలనలో తలెత్తుతున్న ప్రశ్నలు. అక్టోబర్‌లో ఆర్భాటంతో గ్రామ సభలు నిర్వహించింది. రైతుల నుంచి పెద్ద ఎత్తున అర్జీలు స్వీకరించింది. కానీ వాటికి అతీగతి లేదు. కనీసం పరిష్కారం చూపలేదు. చెత్తబుట్టలో పడేసినట్టు వాటిని పక్కన పెట్టేసింది. ఇప్పుడు కొత్తగా రెవెన్యూ సదస్సుల పేరుతో హడావుడి చేస్తోంది.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబర్‌లో పెద్ద ఎత్తున గ్రామసభలు నిర్వహించింది. ఎమ్మెల్యేలు సైతం హాజరై హడావుడి చేశారు. అధికారికంగా జరగాల్సిన సభలకు రాజకీయ రంగు పులిమారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభల్లో పెద్ద ఎత్తున ప్రజల నుంచి అర్జీలు సేకరించారు. 735 గ్రామాల్లో సభల ద్వారా 30,669 అర్జీలను యంత్రాంగం సేకరించింది. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 16,711ఉండగా, సర్వే శాఖవి 13,958 అర్జీలు ఉన్నాయి. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని అర్జీలివ్వగా వాటికి ప్రభుత్వం పరిష్కారం చూపలేదు. ప్రజలు మాత్రం తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురు చూస్తున్నారు.

62 మాత్రమే పరిష్కారం..

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో జరిగిన గ్రామ సభల్లో 30,669 అర్జీలు రాగా వాటిలో 62మాత్రమే పరిష్కారమైనట్టు చూపించారు. మిగతావన్నీ పెండింగ్‌లో పెట్టేశారు. పలాస డివిజన్‌లో 214 గ్రామ సభల ద్వారా 6572 అర్జీలు తీసుకోగా, శ్రీకాకుళం డివిజన్‌లో 309 సభల ద్వారా 15,862 అర్జీలు స్వీకరించగా, టెక్కలి డివిజన్‌లో 214 సభల ద్వారా 8235 అర్జీలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీల్లో 9,799 పట్టాదారుల మ్యూటేషన్లకు సంబంధించి ఉండగా, 4,462 పట్టాదారుల డిటైల్స్ కరెక్షన్స్‌కు సంబంధించి ఉన్నాయి. 319 వరకు క్లాసిఫికేషన్ కరెక్షన్స్‌వి కాగా మిగతావన్నీ సర్వే శాఖకు సంబంధించినవే. వచ్చిన మొత్తం అర్జీల్లో 2020 వరకు విచారణ చేసి కేవలం 62 మాత్రమే పరిష్కరించారు. దీన్నిబట్టి గ్రామసభల అర్జీలపై ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవుతోంది.

టీడీపీకి కొత్తేమీ కాదు..

ప్రధాన పాలకపక్షమైన టీడీపీకి ఇలాంటి వ్యవహారాలు కొత్తేమీ కాదు. గతంలో కూడా ఇదే రకంగా దరఖాస్తులు స్వీకరించడం, ఆపై పక్కన పెట్టేయడం ఆనవాయితీగా వస్తోంది. 2014–19లో ఇలాంటి డ్రామాలు అనేకం జరిగాయి. ప్రజల నుంచి తీసుకున్న అర్జీలకు పరిష్కారం చూపలేదు సరికదా.. తాత్సారం చేస్తూ ప్రజల ఆశలను అడియాశలు చేసింది. ముఖ్యంగా రైతుల మనోభావాలు, వారి ఇబ్బందులతో ఆడుకుంది. ఇప్పుడు మళ్లీ అదే డ్రామాలకు తెరలేపింది. అక్టోబర్‌లో నిర్వహించిన గ్రామ సభలు అటకెక్కాయి. వాటి ద్వారా వచ్చిన అర్జీలు పక్కకు వెళ్లిపోయాయి.

ఇప్పుడు రెవెన్యూ సదస్సులని మరో అవతారమెత్తుతోంది. ఈ నెల 6 నుంచి వచ్చే నెల 8వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించనుంది. సమస్య తీవ్రత ఆధారంగా గడువు నిర్దేశించి పరిష్కారం చూపుతామని అధికారులు చెబుతున్నారు. మరి ఈ సదస్సుల ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందో లేదో తెలియదు గాని వివాదాలు చోటు చేసుకుంటాయేమోనన్న భయం మాత్రం సర్వత్రా నెలకొంది. ఎందుకంటే, భూవివాదాలు అటువంటివి. వైఎస్ జగన్ ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేసి, రికార్డుల క్రమబద్ధీకరణ చేయగా, ఇప్పుడీ ప్రభుత్వం ఆ ప్రక్రియను పక్కన పెట్టి కొత్తగా సమస్యల వినతులు తీసుకుంటోంది.



టెక్కలిలోని ఓ థియేటర్ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన అల్లు అర్జున్ భారీ కటౌట్

అస్సలు తగ్గేదే లే..

- జిల్లాలోని 40 థియేటర్లలో పుష్ప 2 సినిమా
- సందడి చేసిన అల్లు అర్జున్ అభిమానులు
- ప్రత్యేక గెటప్‌లతో ఆకట్టుకున్న ఫ్యాన్స్



శ్రీకాకుళంలోని ఓ థియేటర్ వద్ద పుష్పరాజ్ గెటప్‌లో అభిమాని

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన పుష్ప 2 చిత్రం థియేటర్లలో సందడి చేస్తోంది. జిల్లాలో గురువారం ఎక్కడ చూసినా పుష్ప2 మేనియా కనిపించింది. చిత్రం విడుదల సందర్భంగా థియేటర్ల వద్ద పెద్ద ఎత్తున కోలాహలం నెలకొంది. అల్లు అర్జున్ ఫ్యాన్స్ సంబరాలు అంబరాన్ని అంటాయి. కటౌట్స్‌కు పాలాభిషేకం చేశారు. జై బన్నీ.. జై బన్నీ నినాదాలతో థియేటర్ల వద్ద హోరెత్తించారు. శ్రీకాకుళం సరస్వతీ మహల్, టెక్కలిలోని భవానీ థియేటర్ వద్ద పలువురు అభిమానులు పుష్ప2 చిత్రంలోని పుష్పరాజ్ గెటప్‌లను వేసి, డప్పుల దరువుల మధ్య డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. అల్లు అర్జున్ మేనరిజంతో ఆకట్టుకున్నారు.

పండగ చేసుకున్న అభిమానులు..

జిల్లాలో 40 థియేటర్లలో పుష్ప2 సినిమా విడుదలైంది. బుధవారం రాత్రి నుంచి బెనిఫిట్ షోలు వేశారు. గురువారం వేకుజామున 6.30గంటల నుంచి దాదాపు ప్రతి థియేటర్లలో ఐదు షోలు వేశారు. థియేటర్లలో వెండి తెరల వద్ద అభిమానుల సందడి, కేరింతలకు అవధుల్లేకుండా పోయింది. సినిమా బిగ్గెస్టు హిట్‌గా నిలిచిందంటూ సంబరాలు చేసుకున్నారు. అల్లు అర్జున్ యాక్షన్ వేరే లెవెల్ అని, నటనా విశ్వరూపంతో గూస్‌బంప్స్ తెప్పించారని, చిత్రంలోని జాతర ఎపిసోడ్ అద్భుతమని అభిమానులు పండగ చేసుకుంటున్నారు. అల్లు అర్జున్ యాక్షన్, సుకుమార్ దర్శకత్వం గురించి ఎంత చెప్పినా తక్కువే అని అభిమానులు, ప్రేక్షకులు కొనియాడుతున్నారు.

పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామాల్లో అన్ని రకాల రెవెన్యూ, వ్యక్తిగత భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 6 నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. రెవెన్యూ సదస్సుల ప్రణాళిక, కార్యాచరణపై గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఎండోమెంట్, రిజిస్ట్రేషన్, వక్ఫ్ బోర్డ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 2025 జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిర్దేశిత గ్రామాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి సదస్సులు ప్రారంభమవుతాయని తెలిపారు. మండల రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, మండల సర్వేయర్, దేవదాయ శాఖ, వక్ఫ్ బోర్డు, రిజిస్ట్రేషన్ శాఖ, అటవీ శాఖ, పోలీసు అధికారులు, బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు హాజరై గ్రామానికి సంబంధించిన అన్ని రకాల రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతారని వివరించారు. గ్రామస్థాయిలో చర్చకు వచ్చిన సమస్యలను తర్వాత దశలో మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుందన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే రాష్ట్రస్థాయిలో సమీక్ష జరుగుతుందన్నారు. సదస్సుల పర్యవేక్షణకు ప్రతి మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుంటూ సదస్సులను విజయవంతం చేయాలని సూచించారు. ముందస్తుగా గ్రామాల్లో కరపత్రాల పంపిణీ చేయాలన్నారు.

పాలిటెక్ ఫెస్ట్–2024 ప్రారంభం



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా ముందుకు సాగాలని సాంకేతిక విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు జె.సత్యనారాయణమూర్తి అన్నారు. కుశాలపురం పరిధిలోని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి జిల్లా ప్రాంతీయ స్థాయి రెండు రోజుల పాలిటెక్ ఫెస్ట్ -2024ను ఆయన ప్రారంభించారు. జిల్లా నుంచి 10 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొని 69 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఎంపిక చేసిన 15 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్‌లో ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ డిప్లమో విద్యార్థులు ప్రయోగాలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. మూడేళ్ల డిప్లమో పూర్తయ్యాక శత శాతం ప్లేస్‌మెంట్ లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థులకు మెరుగైన ప్యాకేజీలతో ఉద్యోగాలు లభిస్తున్నాయని చెప్పారు. సాంకేతిక విద్యాశాఖ సైతం విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ అకడమిక్ ఉప సంచాలకులు విజయ్‌భాస్కర్, స్థానిక ప్రిన్సిపాల్ బి.జానకి రామయ్య, మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందనాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, సీనియర్ అధ్యాపకులు డి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీర్లకొండకు పోటెత్తిన భక్తులు

ఇచ్ఛాపురం : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఇచ్ఛాపురం పీర్లకొండ యాత్రకు భక్తులు పోటెత్తారు. ఏటా మార్గశిర మాసంలో గురువారాల్లో నిర్వహించే ఈ యాత్రకు కులమతాలకు అతీతంగా అధిక సంఖ్యలో యాత్రికులు, భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి దర్శించుకుంటారు. పీర్లకొండ ప్రారంభ మెట్టు వద్ద హిందూ సంప్రదాయంలో ధూపదీప నైవేద్యాలను సమర్పించి పూజలు చేయడం ఇక్కడి ప్రత్యేకత. కోరికలు నెరవేరాలని కొండపై మొదటి ప్రార్థనా మందిరం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెండో ప్రార్థన మందిరం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.





పీర్లకొండపై యాత్రికులు (ఇన్‌సెట్లో) ముగావర్ దర్గాని దర్శించుకుంటున్న భక్తులు

మేల్ హెల్త్ అసిస్టెంట్లపై వేటు

- 123 మంది కాంట్రాక్టు ఉద్యోగులను పూర్తిగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ
- నాటి కేసులపై హైకోర్టు తుది ఉత్తర్వులు
- తక్షణమే అమల్లోకి తెచ్చిన డీఎంహెచ్ఓ

అరసవల్లి: కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్యారోగ్య శాఖ చరిత్రలో ఓ సంచలనమైన తీర్పు వెలువడింది. 2002 నాటి కాంట్రాక్టు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (మేల్) ఉద్యోగాల నోటిఫికేషన్‌లో జరిగిన అవకతవకల పుణ్యమా అని ఏకంగా ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది. నాటి పాలకుల అక్రమాల ఫలితంగా ఇష్టానుసారంగా వ్యవహారాలు చేయడంతో నేడు వందలాది మంది ఉద్యోగులు రోడ్డున పడాల్సివచ్చింది. అప్పట్లో నోటిఫికేషన్ విడుదలైనప్పుడు.. ప్రస్తుతం తీర్పు వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడే ఉండటం గమనార్హం.

ఆగమేఘాలపై..

జిల్లాలో వివిధ పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (మేల్) ఉద్యోగులుగా పనిచేస్తున్న 123 మంది కాంట్రాక్టు ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఉత్తర్వులు అమలయ్యేలా ఆదేశాలు రావడంతో ఆయా కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి పీహెచ్‌సీల నుంచి రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల వైద్యారోగ్య శాఖాధికారులకు ఆదేశించింది. ఈ మేరకు 123 మందిని విధుల నుంచి తొలగిస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నాడు ఏమైందంటే....

జీఓ 1207 ప్రకారం 2002లో మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. మొదట పదో తరగతి విద్యార్హతతో ఉద్యోగాలు ఇచ్చేలా నిర్ణయించారు. అయితే ఇంటర్‌లో ఒకేషనల్ గ్రూప్‌తో అర్హత సాధించిన వారు మాత్రం ఈ ఉద్యోగాలు తమకే ఇవ్వాలంటూ కోర్టులను ఆశ్రయించారు. దీనిపై అప్పట్లో మళ్లీ నోటిఫికేషన్‌కు సవరణలు చేసి ఉమ్మడి పరీక్ష ద్వారా పది, ఇంటర్ విద్యార్హతలు గల వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇందులో కూడా అత్యధికంగా పదో తరగతి అర్హత ఉన్న వారే ఎక్కువగా ఉద్యోగాలు సాధించడంతో మరికొందరు ఇంటర్ అర్హులు తమకు మాత్రమే ఈ పోస్టులు ఇవ్వాలంటూ కోర్టుకెక్కారు. ఇదే తంతు కొన్నాళ్లు సాగగా.. తాజాగా ఈ పోస్టుల్లో ఉన్నవారిలో విద్యార్హతతో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కూడా పాటించలేదని, కేవలం అడ్డదారిలో నియామకాలు జరిపారంటూ కోర్టు నిర్ధారించి తుది తీర్పును గురువారం వెలువడించింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

కాంట్రాక్టు మేల్ హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి పూర్తిగా తొలగించాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. వెంటనే ఆయా పీహెచ్‌సీల నుంచి మొత్తం 123 మంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలిగిస్తూ చర్యలు చేపట్టాం. అప్పట్లో అడ్డగోలుగా విద్యార్హతలతో ఈ నియామకాలు జరిగినట్లుగా కోర్టు గుర్తించింది. అందుకే తక్షణమే వీరిని తొలిగించాం.

– బి.మీనాక్షి, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

గుర్తు తెలియని జంతువు దాడి

● 25 గొర్రె పిల్లల మృత్యువాత



మృత్యువాత పడిన గొర్రెల పిల్లలు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతం నీలావతి గ్రామంలో గుర్తు తెలియని జంతువు గొర్రె పిల్లలను చంపేసిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మాకన్నపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు చిన్ననీలావతి గ్రామంలో ఉన్నటువంటి తోటల్లో మందలు వేస్తున్నారు. వారనుయ్య అని పిలిచే ప్రాంతంలో గొర్రెల మందను గత కొన్ని రాత్రులుగా ఉంచుతున్నారు. ఎప్పటిలాగే గురువారం ఉదయం కొంతమంది గొర్రెల కాపరులు గొర్రెలను, మేకలకు మేతకు తీసుకెళ్లారు. అలాగే కొన్ని గొర్రెలు, మేకల పిల్లలు అక్కడే ఉంచి కాపలాగ ఒక వ్యక్తిని సైతం పెట్టారు. అయితే అతను రాత్రి భోజనాల నిమిత్తం అవసరమైన వంట సామగ్రిని తీసుకు రావడానికి వెళ్లిన సమయంలో ఎత్తైన వల లోపలకు గుర్తు తెలియని జంతువు చొరబడి దాడి చేసింది. ఈ దాడిలో 25 గొర్రె పిల్లలు చనిపోయాయి. దీంతో యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రైలు కిందపడి యువకుడి మృతి

నందిగాం: మండలంలోని కవిటి అగ్రహారం వద్ద రైలు కిందపడి అదే గ్రామానికి చెందిన పుచ్చకాయల ప్రతాప్(20) మృతి చెందాడు. పలాస రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పుచ్చకాయల నర్సింహమూర్తి, మాధవి దంపతులకు వికలాంగురాలైన కుమార్తె, ప్రతాప్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ప్రతాప్ గురువారం పలాస విశాఖపట్నం రైల్వేలైన్‌లో గుర్తు తెలియని రైలు కిందపడి మృతి చెందాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం ప్రకారం రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. చేతికందే వయస్సులో కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అయితే మృతికి గల కారణం తెలియలేదు.

వివాహిత ఆత్మహత్య



శోభారాణి (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని గొట్టిపల్లి పొలాల్లో నూతనంగా నిర్మించిన గృహంలో నివసిస్తున్న బుడుమూరు శోభారాణి (32) ఉరి పోసుకొని గురువారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరిపోసుకుంది. చనిపోయే ముందు భర్త గిరిబాబుకు ఫోన్‌చేసి నేను చనిపోతున్నా.. నీవు వచ్చిన వరకు ఉండను అని చెప్పినట్లు సమాచారం. వెంటనే భర్త స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇంటికి వెళ్లేసరికి లోపలి నుంచి గడియా వేసి ఉంది. ఎంత పిలిచినా పలకడం లేదని స్థానికులు భర్త గిరిబాబుకు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి తలుపులు తెరిచి చూసేసరికి మృతదేహం వేలాడుతూ కనిపించింది. కాగా అత్తా, కోడళ్ల మధ్య మనస్పర్థలే ఆమె మృతికి కారణమని తెలుస్తోంది. గిరిబాబు మూలపేట పోర్టులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి ఇలపండ సింహాచలం కన్నీరుమున్నీరుగా విలపించారు. శోభారాణికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై శోభారాణి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల పేరుతో వల..

విదేశాల్లో విలవిల

● విదేశాలకు వెళ్లేవారిని మోసం చేస్తున్న ఏజెంట్లు ● నిరుద్యోగుల బలహీనతే పెట్టుబడి


● ఆర్థికంగా కుదేలవుతున్న కుటుంబాలు ● టూరిస్ట్, వర్క్ వీసాలతో మోసాలు



సౌదీ అరేబియాలో చిక్కుకున్న తెలుగు నిరుద్యోగ యువకులు

వజ్రపుకొత్తూరు:

నాలుగు తీపి మాటలు.. మరో నాలుగు కంపెనీల పేర్లు.. పక్కనే వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్లు.. వృత్తిలో నైపుణ్యత లేనివారే పెట్టుబడిగా విదేశాలకు పంపించే ఏజెంట్లు రెచ్చిపోతున్నారు. శిక్షణ పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా ఇచ్ఛాపురం, కంచిలి, పూండి, విశాఖపట్నంలోని వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్లలో ఇంటర్వ్యూలు నిర్వహించి మోసానికి పునాదులు వేస్తున్నారు. మెడికల్, గమ్కా మెడికల్ అంటూ రూ.10 వేలు వసూలు చేస్తారు. ముంబాయి, చెన్నై ప్రాంతాల్లో మెడికల్ పూర్తయ్యాక వీసా, విమానయాన ఖర్చులని చెప్పి కంట్రీ ఆధారంగా రూ.1.50 లక్షల నుంచి రూ.5 లక్షలు వరకు వసూలు చేసి పంగనామాలు పెడుతున్నారు.



నిత్యం మోసాలు

నైపుణ్యత లేని వృత్తుల్లోకి నిరుద్యోగులను పంపడంతో విదేశాల్లో ఉన్న లేబర్ చట్టాలు, అక్కడ నిబంధనలు తెలియని నిరుద్యోగులు నిత్యం ఏజెంట్ల చేతిలో మోసానికి గురవుతున్నారు. పూండిలోని కొంతమంది ఏజెంట్లు రెండు నెలల కిందట పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాలకు చెందిన 27 మంది నిరుద్యోగులను సౌదీ ఆరేబియాలోని కొంబన్ అనే కంపెనీలో ఉద్యోగం, మంచి జీతం అని చెప్పి పంపించారు. తీరా అక్కడికి వెళ్లాక నిరుద్యోగులు మోసపోయారు. అక్కడ కంపెనీ సరైంది కాకపోవడం.. జీతాలు ఇవ్వకపోవడం .. గట్టిగా అడిగితే భోజనం కూడా పెట్టకుండా మీరు ఇండియా ఎలా వెళ్తారో చూస్తామంటూ బెదిరిస్తున్నారని వెళ్లినవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సౌదీలో లగేజీ బ్యాగ్‌లతో రోడ్లు వెంబడి తిరుగుతున్నారు. అయినా ఇక్కడ ఏజెంట్లు మాత్రం కులాసాగా ఉండడం విశేషం

కొన్ని సంఘటనలు

● ఉద్దానం గోపినాథపురానికి చెందిన ఒక ఏజెంట్ మూడేళ్ల కిందట పూండి కేంద్రంగా చేసుకుని కొంతమంది బయట దేశాల్లో ఉపాధి పొందుతున్న వారిని సైతం పిలిపించి, రష్యా పంపిస్తానని జీతం రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలు వస్తుందని నమ్మబలికాడు. సుమారు 200 మందిని రష్యా, పోలెండ్ పంపిస్తానని చెప్పి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.10 వేలు నుంచి రూ.50 వేలు వరకు అడ్వాన్స్‌గా తీసుకుని చేతులెత్తేశాడు. ఈ పంచాయతీ పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లినా బాధిత నిరుద్యోగులకు న్యాయం జరగలేదు.

● పీఎంపురానికి చెందిన మరో ఏజెంట్ రెండేళ్ల కిందట 120 మంది నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేసి వారికి ముప్పుతిప్పలు పెట్టాడు. చివరకు అప్పటి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కలుగజేసుకొని యూఆర్‌కేపురం, యజీపురం, చిన్నమురహరిపురం తదితర గ్రామాలకు చెందిన వారిని విదేశాల నుంచి రప్పించారు.

● విశాఖపట్నంకు చెందిన మరో వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ గతేడాది మార్చి 23న 62 మంది ఉద్దానం నిరుద్యోగులను దుబాయ్, సింగపూర్ పంపిస్తామని ఇక్కొక్కరి నుంచి రూ.60 వేలు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. ఇలాంటి మోసాలకు స్థానికంగా ఉన్న ఏజెంట్లే కీలకంగా వ్యవహరిస్తుండడం విశేషం

ఇవీ నిబంధనలు

● విదేశాలకు వెళ్లాలంటే సాధారణంగా రెండు రకాల వీసాలు ఉంటాయి. అందులో ఒకటి తాత్కాలిక పని అనుమతి వీసా. ఇది 2 నుంచి నాలుగేళ్లు ఉంటుంది. ఇంకొకటి శాశ్వత పని అనుమతి వీసా. ఈ వీసాతో ఐదేళ్లు ఆ దేశంలో శాశ్వతంగా పని చేసేందుకు అనుమతిస్తుంది.

● విదేశీ భాష నైపుణ్యం అవసరం, యూనివర్సల్ లాంగ్వేజ్ ఇంగ్లిష్, హిందీ తప్పనిసరి. కొన్ని దేశాల్లో మీరు లాంగ్వేజ్ ప్రొఫిసియన్సీ టెస్ట్‌కు అర్హత సాధించాలి.

● మరీ ముఖ్యంగా ఆ దేశాల్లో ఉన్న క్రిమినల్, న్యాయ, సామాజిక పౌర సేవలు, లేబర్ చట్టాలపై అవగాహన తప్పనిసరి. ● వెళ్లే దేశం ఆధారంగా ఆయా సంస్థలు నిరుద్యోగులకు ఆ దేశాల చట్టాలపై అవగాహన కల్పించాలి.



వృత్తి నైపుణ్యం కీలకం

● సంబంధిత యజమాని సంస్థ నుంచి ధ్రువీకరించిన జాబ్ ఆఫర్, ఉపాధి ఒప్పందం ధ్రువీకరణ తీసుకోవాలి.

● ఇండియన్ ఎంబసీ నుంచి అనుమతులు ఉండాలి. అర్హత పత్రాలు, నైపుణ్యత రుజువు చేయాలి.


● వెళ్లాల్సిన దేశంలో డిమాండ్‌లో ఉన్న పనిపై నైపుణ్యత, ప్రతిభ అవసరం.

● ఇమిగ్రేషన్ అనుమతులు తప్పనిసరి. వీసా, పాస్‌పోర్టు, విదేశాల్లో చట్టాలు, తదితర అంశాలపై అవగాహన ఉండాలి.

● కొన్ని దేశాల్లో మీ ఆరోగ్యానికి, భద్రతకు హాని కలిగించకుండా చూసుకోవడానికి వైద్య పరీక్షలు అత్యవసరం. పోలీసుల క్లియరెన్స్ సర్టిఫికెట్ ఉండాలి.

● వర్క్ వీసాను ప్రాసెస్ చేయడానికి దేశాలను బట్టి ప్రత్యేక రుసుం ఉంటుంది. అది వీసా పొందిన వ్యక్తే చెల్లించాల్సి ఉంటుంది.

● ముఖ్యంగా మన దేశం నుంచి విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఓ సంస్థ ఉంది. ఆ సంస్థ ద్వారా విదేశాల్లో ఉద్యోగం పొందితే మన భద్రత అంతా ఆ సంస్థే చూసుకుంటుంది. పైగా మోసపోవడానికి అవకాశమే ఉండదు.



తమను మోసం చేశారంటూ యువకులు రాసిన లేఖ

జైల్లో పెడతామని బెదిరిస్తున్నారు



ప్రతినెలా జీతం ఇస్తామని చెప్పి మమ్మల్ని సౌదీ పంపించారు. రెండేళ్లు అని చెప్పి మూడు నెలలకే టూరిస్ట్ వీసా ఇచ్చారు. రూ.40 వేల జీతం అన్నారు. ప్రతి ఒక్కరి దగ్గర నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు జీతం ఇవ్వడం లేదు. వసతి, భోజనం ఉచితమని చెప్పారు కానీ అదీ లేదు. ఇంటి నుంచి తెచ్చిన డబ్బులు భోజనాలకు ఖర్చు అయిపోయాయి. ఆకలితో అలమటిస్తున్నాం. గట్టిగా నిలదీస్తే జైల్లో పెడతామని భయపెడుతున్నారు. చనిపోతే చనిపోమని మమ్మల్ని పంపించిన ఏజెంట్లు అంటున్నారు. దయచేసి మమ్మల్ని ఇండియాకు రప్పించండి.

– అడ్డి హేమాచలం, మల్లపాడు, నందిగాం మండలం

నరకయాతన



నాకు రూ.40 వేల జీతం, మంచి భోజనం, విలాసవంతమైన గదులు ఇస్తారని నమ్మబలికి ఇక్కడికి ఏజెంట్ పంపించాడు. కానీ ఇక్కడ సాధారణ వెల్డింగ్ షాపు లాంటి వర్క్ షెడ్డు ఉంది. వెట్టిచాకిరీ చేయించుకొని జీతం ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే భోజనం సైతం పెట్టకుండా భయపెడుతున్నారు. ఉన్న డబ్బులు అయిపోవడంతో మసీదుల వద్ద ప్రసాదం అడుక్కొని తింటున్నాం. అమలపాడు జంక్షన్‌లో ఉన్న ఏజెంట్‌ను నిలదీస్తే పంపించే వరకే నా బాధ్యత అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడు.

– మద్దలి శివ, రెయ్యిపాడు, వజ్రపుకొత్తూరు మండలం

జగన్ దృష్టికి తీసుకెళ్లాం



సౌదీ అరేబియాలో తెలుగు యువకులు, ఒడిశాకు చెందిన యువకులు చిక్కుకోవడం బాధాకరం. వారిని ఇండియా కు రప్పించే విషయాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. రాతపూర్వకంగా వివరాలు అందించాం. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ విజయ సాయిరెడ్డి ద్వారా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశాం. సమస్యపై ఆయన స్పందించారు. త్వరలోనే వారిని ఇండియాకు రప్పించేందుకు మా వంతు కృషి చేస్తాము.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడి(60) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు గత కొద్ది రోజులుగా టెక్కలి పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతుండగా స్థానికులు సపర్యలు చేసి టెక్కలి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అయితే ఆస్పత్రిలో ఆ వృద్ధుడు గందరగోళం సృష్టించి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం రెండు రోజుల తర్వాత ఆస్పత్రి సమీపంలో ఈవిధంగా మృతి చెంది ఉండడం స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, ఆ వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. అయితే మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియలేదని, ఎవరికైన తెలిసినట్టైతే టెక్కలి పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

చెరువులో పడి ఒకరు మృతి



సింహాచలం (ఫైల్)

నరసన్నపేట: స్థానిక సంతపేట వద్దనున్న గోరువాని చెరువులో వీరన్నాయుడు కాలనీ సమీపంలోని సంతోషినగర్‌కు చెందిన గొండు సింహాచలం (33) అను మానాస్పదంగా మృతి చెందారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలించి బయటకు తీశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం తన కుమారుడి నిశాంత్ ఆధార్ కార్డు సరి చేయడానికి ఇంటి నుంచి సింహాచలం టౌన్‌కి వచ్చాడు. మధ్యలో పలుమార్లు భార్య సంతోషిణి ఫోన్‌చేస్తే పని కాలేదు.. వచ్చేస్తానని సమాధానం చెప్పాడు. అయితే చీకటిపడినా ఇంటికి రాకపోగా సాయంత్రం 7.30 తర్వాత ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చిందని భార్య తెలిపారు. ఉదయం శవమై కనిపించాడని వాపోయింది.

కొంపముంచిన మద్యం పార్టీ..?

సింహాచలం స్నేహితుడు దుర్గారావు మాట్లాడుతూ తామ అందరం కలిసి మద్యం తాగామన్నాడు. అనంతరం స్నానానికి చెరువులో దిగి, స్నానాలు ముగిశాక ఒడ్డుకు వచ్చేశామని తెలిపారు. అయితే తాము వెళ్లిపోతుండగా సింహాచలం వెనుక కనిపించలేదని, వెంటనే వెనక్కి వచ్చి చూసేసరికి చెరువులో కొద్దిదూరంలో చేతులు కొట్టుకుంటూ సింహాచలం కనిపించాడన్నారు. వెంటనే లోనికి వెళ్లి ఆయనను కాపాడేందుకు ప్రయత్నించినా మనిషి కనిపించలేదన్నారు. కొద్దిసేపు గాలించి కుటుంబ సభ్యులకు కబురు చేశామని, వారు వచ్చిన తర్వాత అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చామన్నా రు. వారు వెతికినా మనిషి ఆచూకీ లభించలేదన్నారు. ఉదయం మళ్లీ అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలించగా చెరువులో మృతదేహం 9 గంటల సమయంలో లభించిందని పేర్కొన్నా రు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా సింహాచలంకు ఈత వచ్చని అలాంటప్పుడు ఎలా చెరువులో మునిగి మృతి చెందుతాడని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. అయితే స్థానికులు మాత్రం ప్రమాదవశాత్తు ఈ ప్రమాదం జరిగిందని చెరువులో మునిగి సింహాచలం మరణించాడని అంటున్నారు. కాగా మృతుడు రోజువారీ కూలీ. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు చరిస్మా, నిశాంత్‌లు ఉన్నారు. ఘటనపై నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లి జాతీయ రహదారి వంతెన సమీపంలో కారు బోల్తా పడిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది.పలాసకు చెందిన బెవర రాంప్రసాద్ సొంత కారును సర్వీసింగ్ కోసం టెక్కలి వైపు తీసుకువెళ్తుండగా పెద్దతామరాపల్లి వంతెన సమీపంలోకి వచ్చే సరికి అకస్మాత్తుగా డీవైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. వెంటనే స్థానికులు స్పందించి కారులో చిక్కుకున్న రాంప్రసాద్‌ను బయటకు తీశారు. ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

శుభకార్యానికి వెళ్తూ..

అనంత లోకాలకు

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

● ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు





దట్టిసాయి, మనీష (ఫైల్)

మెళియాపుట్టి: గుండెలవిసేలా తల్లి రోదన.. చెల్లాచెదురుగా చిన్నారి రక్తపు దేహం.. చూడటానికి కూడా ధైర్యం చేయలేని పరిస్థితి కలిగిన ఘోరమైన రహదారి ప్రమాదం మండలంలోని చిన్నహంస గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో 8వ తరగతి విద్యార్థిని మనీష(13), మందస మండల కేంద్రానికి చెందిన మరో యువకుడు దట్టి సాయి(20) దుర్మరణం పాలయ్యారు. అలాగే ఇంకో చిన్నారి శిరీష, చామంతి గాయాలపాలయ్యారు. మెళియాపుట్టి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మర్రిపాడు–కె గ్రామ పంచాయతీ మురికింటిభద్ర గ్రామానికి చెందిన ముగడ చామంతి తన కుమార్తె మనీష, తన మరిది కూతురు శిరీషలతో కలిసి తన బావ కుమారుడు దట్టిసాయి ద్విచక్ర వాహనంపై (మొత్తం నలుగురు ఒకే వాహనంపై) మందస మండల కేంద్రంలోని ఒక శుభ కార్యానికి బయల్దేరారు. కొంతదూరం వెళ్లాక చినహంస గ్రామ సమీపంలో ధాన్యపు బస్తాల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను దట్టి సాయి ఓవర్‌టేక్ చేయబోయాడు. అయితే ఈ సమయంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో మనీష తలపై నుంచి ట్రాక్టర్ టైరు వెళ్లిపోయింది. అలాగే దట్టిసాయి తల రహదారికి బలంగా తాకడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మనీష తల్లి చామంతి, శిరీషలు గాయాలతో బయటపడ్డారు. వారిరువురినీ చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలు శిరీష పలాస మండలంలోని టెక్కలిపట్నంలో 8వ తరగతి చదువుతోంది. సమాచారం అందుకున్న పాతపట్నం సీఐ రామారావు, స్థానిక ఎస్ఐ రమేష్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రయాణాల్లో వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.



తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్షలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కళింగ కుల అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

–శ్రీకాకుళం(పీఎన్ కాలనీ)

గోవుల అక్రమ రవాణా అడ్డగింత



పట్టుబడిన ఆవులు

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా రవాణా చేస్తున్న 13 ఆవులను పట్టుకుని కొత్తవలస గోశాలకు తరలించామని నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం తిలారు నుంచి అలమండ సంతకు ఒక వాహనంలోఆవులు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టుకున్నామని చెప్పారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ పి.నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు.

పుస్తెలతాడు చోరీ

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంత సమీపంలో ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును దుండగులు తెంచుకొని పరారయ్యారు. నారాయణవలసకు చెందిన రావాడ అప్పలమ్మ సంతకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు రెండు తులాల పుస్తెలతాడును తెంచుకొని పరారయ్యారు. కోటబొమ్మాళి ఎస్సై సత్యన్నారాయణ కేసు నమోదు చేశారు.

విచారణ సక్రమమేనా..!

● అధికారుల నివేదికపై అనుమానాలు

టెక్కలి: ప్రతిష్ఠాత్మక రావివలస ఎండల మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో ఇటీవల కార్తీక మాసంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా చోటుచేసుకున్న తప్పిదాలపై దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్ చేపట్టిన విచారణపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈవో గురునాథరావు ఆధ్వర్యంలో మల్లన్న సన్నిధిలో నిర్వహించిన కార్తీకమాసం ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ప్రసాదాలు అందని వైనం, టికెట్ల రీసైక్లింగ్ వ్యవహారంపై బహిరంగంగా లోపాలు బయటపడ్డాయి. దీంతో పలు పత్రికల్లో వచ్చిన కథనాలు, సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలపై తక్షణమే స్పందించాల్సిన అధికారులు, కొన్ని రోజుల తర్వాత విచారణ చేపట్టడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన బీజేపీ, జనసేన కార్యకర్తల సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా లోపాలపై నిలదీసిన సాక్షులను సైతం ప్రలోభాలకు గురి చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా మల్లన్న దేవాలయం ఈవో గురునాథరావు, ఏసీ ప్రసాద్ పట్నాయక్ మధ్య ఉన్నటువంటి గురుశిష్యుల సత్సంబంధాలతో విచారణ నివేదిక విషయంలో మేనేజ్ చేశారనే ఆరోపణలు లేకపోలేదు.

అధికారుల జేబుల్లోకి ఆదాయం..?

మల్లన్న దేవస్థానంలో సుమారు నెల రోజులకు భక్తుల నుంచి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్తీకమాసంలో జిల్లాలో శ్రీముఖలింగంతో పాటు రావివలస మల్లన్న దేవస్థానానికి జిల్లాతో పాటు ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి దర్శించుకున్నారు. అయితే అధికారకంగా ప్రకటించిన ఆదాయంతో పాటు అనధికారకంగా రెట్టింపు ఆదాయం అధికారుల జేబుల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. టికెట్ల రీసైక్లింగ్ వ్యవహారంలో బయటపడిన తప్పిదాలు కాకుండా అంతకుముందు ఎంతమేరకు రీసైక్లింగ్ జరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ప్రసాదాలకు అధికారులకు సమర్పించిన నివేదికపై సమగ్రమైన విచారణ చేస్తే తప్ప అసలు నిజాలు బయటపడవు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొట్ట మొదటిసారిగా జరిగిన కార్తీకమాసం ఉత్సవాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ మొదటి నుంచి అక్రమాలు చోటు చేసుకోవడంతో కూటమి పార్టీలకు చెందిన బీజేపీ, జనసేన కార్యకర్తలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా, దీనిపై మంత్రి కనీసం ఇంతవరకు స్పందించకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.